క్లుప్తంగా

శ్రీవారి సన్నిధిలో మహాన్నదానం



అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

కొమ్మాది: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం మహాన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. నగరానికి చెందిన ఎన్.డి.మున్నంగి దిలీప్ కుమార్ 600 మంది భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఏఈవో జగన్మోహనాచార్యులు, సూపరింటెండెంట్ వెంకటరమణ, ఇన్‌స్పెక్టర్ శివ, కిషోర్ పాల్గొన్నారు.

గ్రామాల్లో 'నా భూమి - నా దేశం' కార్యక్రమాలు



మొక్క నాటుతున్న లక్ష్మణరావు, తదితరులు

పద్మనాభం: మండలంలోని పలు పంచాయతీల్లో శనివారం 'నా భూమి – నా దేశం' కార్యక్రమాలు నిర్వహించారు. బుడ్డివలస – అగ్రహారంలో వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, సర్పంచ్ పిన్నింటి సూర్యనారాయణ, పెంట గ్రామంలో సర్పంచ్ బోదల పావని, కొవ్వాడలో సర్పంచ్ పొన్నకాయల రత్నం, ఎంపీటీసీ సభ్యురాలు బోని రమణమ్మ, అనంతవరం, బాందేవుపురం, గంధవరం గ్రామాల్లో ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో వరలక్ష్మి, ఈసీ తులసి పాల్గొన్నారు.

చక్కగా చదివితే ఉజ్వల భవిష్యత్



నగదు బహుమతులు అందుకున్న విద్యార్థులతో నిర్వాహకులు

భీమునిపట్నం: విద్యార్థులు చక్కగా చదివితే భవిష్యత్ ఉజ్వలంగా వుంటుందని మండల విద్యా శాఖ అధికారి శివరాణి అన్నారు. భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతిలో ఎక్కువ మార్కులు సాధించిన వారికి కేటిస్‌పేటలో సన్ స్కూల్ డైరెక్టర్ కై తవల్లి శ్రీనివాసరావు శనివారం నగదు ప్రోత్సాహకాలు అందించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో శివరాణి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ప్రోత్సహించడం మంచి విషయమన్నారు. ఎక్కువ మార్కులు సాధించిన ఇద్దరు విద్యార్థులకు రూ.5 వేలు చొప్పున, మరో 12 మందికి రూ.3 వేల చొప్పున నగదు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాపై సర్వే పూర్తి చేయాలి

తగరపువలస: ఓటర్ల జాబితాలకు సంబంధించి ఇంటింటా సర్వే ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని జేసీ కె.ఎస్.విశ్వనాథన్ అధికారులకు సూచించారు. భీమిలి నియోజకవర్గ పరిధిలో నిర్వహిస్తున్న ఇంటింటా సర్వేను ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడుతూ భార్యాభర్తలు వివిధ పోలింగ్ స్టేషన్ల పరిధిలో ఓటర్లుగా నమోదైనా, ఓటర్ల జాబితాలో చేర్చకపోయినా, 18 ఏళ్లు నిండి ఓటరుగా నమోదు కాకపోయినా బీఎల్‌వో వారి ఇంటిని సందర్శించినప్పుడు క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ఆర్డీవో పి.భాస్కరరెడ్డి, తహసీల్దార్లు పాల్గొన్నారు.

మండలానికో డీసీసీబీ బ్రాంచి

- ఖాతాదారుల ముంగిటికే వాణిజ్య సేవలు
- సహకార సంఘాలకు ఆర్బీకేలు అనుసంధానం
- డీసీసీబీ చైర్మన్ కోలా గురువులు



రైతులకు రుణ మంజూరు చెక్కులు అందజేస్తున్న డీసీసీబీ చైర్మన్ కోలా గురువులు



కేంద్ర సహకార బ్యాంక్ బ్రాంచి ఏర్పాటు కోసం భవనాన్ని పరిశీలిస్తున్న కోలా గురువులు

ఆనందపురం : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆలోచనల మేరకు రైతుల ప్రయోజనార్థం సహకార సంఘాల సేవలను విస్తృత పరచడానికి మండలానికి ఒక కేంద్ర సహకార బ్యాంక్ బ్రాంచిని ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని డీసీసీబీ చైర్మన్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ కోలా గురువులు అన్నారు. శనివారం ఆయన ఆనందపురం సహకార సంఘం కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సహకార సంఘాల ద్వారా వాణిజ్య బ్యాంకులకు దీటుగా రైతులకు సేవలు అందించాలని ఆదేశించారని చెప్పారు. స్థానికంగా ఉండే వ్యవసాయ పరపతి సహకార సంఘాలు ద్వారా రూ.5 లక్షలు దాటి రుణం అందించడానికి అవకాశం లేదన్నారు. కేంద్ర సహకార బ్యాంక్ బ్యాంచిలు ద్వారా మాత్రమే ఎక్కువ మొత్తంలో రుణాలు అందించడానికి అవకాశం ఉందన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో 43 మండలాలు ఉండగా ఇంత వరకూ కేంద్ర సహకార బ్యాంక్ బ్రాంచిలు 30 మాత్రమే ఏర్పాటయ్యాయన్నారు. దీంతో రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని మండలానికి ఒకటి చొప్పున ఉమ్మడి విశాఖ జిల్లాలో మరో 13 బ్రాంచిలు ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపామన్నారు. ముందుగా ఆనందపురం, పద్మనాభం మండలాల్లో ఏర్పాటుకు అనుమతి వచ్చిందని, నెల రోజుల్లో ఏర్పాటు చేస్తామని వివరించారు. ఈ బ్రాంచిలలో ఖాతాదారుల సౌకర్యార్థం వాణిజ్య బ్యాంకులు అందించే అన్ని సేవలు అందుబాటులో ఉంచడంతోపాటు ఏటీఎం కూడా ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో 98 వ్యవసాయ పరపతి సంఘాలు ఉన్నాయని, వాటన్నింటినీ రెండు నెలల్లో కంప్యూటరీకరణ చేసి ఆర్బీకేలకు అనుసంధానిస్తామని చెప్పారు. ఇక వాటి ద్వారానే బంగారు ఆభరణాలకు స్థానికంగా రుణాలు అందించే ఏర్పాట్లు చేస్తామన్నారు. ఇతర బ్యాంక్‌ల కంటే తక్కువ వడ్డీకే రుణాలు అందించడానికి చర్యలు తీసుకుంటామని వివరించారు.

రూ.2500 కోట్ల టర్నోవర్ లక్ష్యం

కేంద్ర సహకార బ్యాంక్ ద్వారా ఈ ఏడాది రూ.2,500 కోట్ల టర్నోవర్ సాధించాలనే లక్ష్యంగా పెట్టుకున్నామని కోలా గురువులు వివరించారు. ఇంత వరకూ రూ.2100 కోట్ల టర్నోవర్ ఉండగా రూ.950 కోట్ల డిపాజిట్లు కింద, రూ.1150 కోట్లు రుణాలుగా ఉన్నాయన్నారు. ఉమ్మడి జిల్లాలోని మూడు బ్రాంచిల పరిధిలో వైఎస్సార్ యంత్ర సేవా కేంద్రాలు ద్వారా రైతులకు 280 ట్రాక్టర్లు అందించడానికి 50 శాతం రుణాలు అందించామన్నారు. ఫిష్ ఆంధ్రా షాపుల ఏర్పాటుకు మరో రూ.4.5 కోట్లు రుణంగా అందజేశామని తెలిపారు. ఈ సందర్భంగా పోలిపిల్లి పెంటయ్య, రమణ అనే రైతులకు రుణ మంజూరు చెక్కులు అందజేశారు.

డీసీసీబీ బ్రాంచి ఏర్పాటుకు భవనం పరిశీలన

ఆనందపురంలో కేంద్ర సహకార బ్యాంక్ బ్రాంచి ఏర్పాటుకు డీసీసీబీ చైర్మన్ కోలా గురువులు భవనాన్ని పరిశీలించారు. శనివారం ఇక్కడకు విచ్చేసిన ఆయన వేములవలస మార్కెట్‌కు సమీపంలోని ఓ ప్రైవేట్ భవంతిని పరిశీలించారు. అక్కడ బ్రాంచి ఏర్పాటుకు గల సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆయనవెంట డీసీసీబీ సీఈవో డీవీఎస్ వర్మ, డీసీఎంస్ డైరెక్టర్ పాండ్రింకి అప్పారావు, నోడల్ ఆఫీసర్ రామకృష్ణ, సూపర్‌వైజర్ వేణుగోపాల్, సహకార సంఘాల సీఈవోలు పంచముఖి, దశావతారం, కోటేశ్వరరావు, వెంకటరావు, నారాయణరావు ఉన్నారు.

బైక్ అదుపుతప్పి పెయింటర్ మృతి



పైడిరాజు

భీమునిపట్నం: బైక్ అదుపు తప్పి పడిపోయిన ప్రమాదంలో శుక్రవారం రాత్రి పెయింటర్ చనిపోయాడు. చిట్టివలసకు చెందిన బింగి పైడిరాజు (33) భీమిలిలోని ఓ రిసార్ట్‌లో పెయింటర్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం ఓ శుభకార్యానికి వెళ్తున్నట్లు భార్య బింగి కనకరత్నంకు ఫోన్ చేసి చెప్పాడు. అనంతరం రాత్రి ఇంటికి రాకపోవడంతో ఆమె పలుమార్లు ఫోన్ చేసినా సమాధానం రాలేదు. అయితే శనివారం ఉదయం మళ్లీ ఆమె కాల్ చేయగా ఒక వ్యక్తి ఫోన్ తీసి... మీ భర్త బీచ్‌రోడ్డులోని పోలమాంబ ఆలయం సమీపంలోని కల్వర్ట్ గోతిలో పడి ఉన్నట్టు తెలిపాడు. వెంటనే ఆమె కుటుంబ సభ్యులతో వచ్చి చూడగా తీవ్ర గాయాలతో చనిపోయి ఉండడాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి పరిశీలించి బైక్ అదుపుతప్పి ప్రమాదానికి గురై చనిపోయినట్టు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించి ఎస్ఐ భరత్‌కుమార్‌రాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జీవకోటి మనుగడకు సహకారం అవసరం



విద్యార్థులతో వివిధ ఎన్జీవోల ప్రతినిధులు

తగరపువలస: భూమిపై సకల జీవకోటి మనుగడకు మనవంతు కృషి, సహకారం అవసరమని సిఫా ఎన్జీవో చీఫ్ ఫంక్షనరీ డాక్టర్ శశిప్రభ సూచించారు. భీమిలి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో శనివారం అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. భవిష్యత్ తరాల కోసం పర్యావరణాన్ని రక్షించడానికి అందరూ కృషి చేయాలని కోరారు. ముఖ్యంగా పర్యావరణ పరిరక్షణకు యువత హరిత శిక్షణ పొందాలన్నారు. జలవనరులు కాపాడుకుని జీవరాశి పరిరక్షణకు పాడుపడాలన్నారు. నర్సరీలు పెంచుతూ, సీడ్ బాల్స్ అధికంగా తయారు చేసి సామాజిక వనాలు పెంచాలని కోరారు. ఎస్‌బీసీసీ జిల్లా కో ఆర్డినేటర్ ప్రసాద్ మాట్లాడుతూ బాలికలు ఆరోగ్యంగా ఉండడానికి ఆరోగ్య సూత్రాలు పాటించాలన్నారు. బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలను వివరించారు. గ్రీన్ క్లైమేట్ టీమ్ ఎన్జీవో వ్యవస్థాపక కార్యదర్శి జనపరెడ్డి రత్నం మాట్లాడుతూ భవిష్యత్ అంతా యువత చేతుల్లోనే ఉందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గంగాకుమారి పాల్గొన్నారు.

అనిట్స్‌లో యువజనోత్సవాలు



ఉత్సవాల్లో విద్యార్థితో మాట్లాడుతున్న కళాశాల సిబ్బంది

తగరపువలస: సంగివలస అనిట్స్‌లో శనివారం ఇంటర్నేషనల్ యువజనోత్సవాలు నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అనంతరం ఎక్స్‌పో కార్యక్రమంలో భాగంగా కై నటిక్ క్యాంపస్ విత్ ఈకోజెన్ హౌస్, ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్ సిస్టమ్, ప్రాజెక్ట్ కే మూవీ ఇన్ఫో సిస్టమ్ వంటి 30 రకాల ప్రయోగాల ద్వారా సృజనాత్మకతను కళాశాల సిబ్బంది, తల్లిదండ్రుల ఎదుట విద్యార్థులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కె.శ్రీరామకృష్ణ మాట్లాడుతూ నైపుణ్యాలతో తయారు చేసిన ప్రాజెక్టులను చూసి అభినందించారు. విద్యార్థులు చదువుతోపాటు ప్రపంచంలో అత్యున్నతమైన శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కన్వీనర్లు ఎం.కల్యాణ్ చక్రవర్తి, ఎ.సత్య ఫణికుమారి, కో ఆర్డినేటర్లు ఎస్.వరసతీష్, అభి బునిషా బేగం తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయశాస్త్ర పితామహుడికి నివాళి



రంగనాథన్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఆచార్య వెంకటేశ్వర్లు తదితరులు

ఏయూక్యాంపస్: గ్రంథాలయశాస్త్ర పితామహుడు ఎస్.ఆర్.రంగనాథన్ 131వ జయంతిని ఆంధ్ర విశ్వవిద్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయంలో రంగనాథన్ విగ్రహానికి గ్రంథాలయాధికారి ఆచార్య పి.వెంకటేశ్వర్లు పూలమాల వేసి నివాళి అర్పించారు.

గ్రంథాలయ శాస్త్రానికి ఒక గుర్తింపు, రూపురేఖలు తీసుకొచ్చిన ఆయన కృషి ఎనలేనిదన్నారు. సంప్రదాయ గ్రంథాలయాల నుంచి నేటి డిజిటల్ లైబ్రరీ వరకు జరిగిన విస్తృతి, ప్రగతిని వివరించారు. భవిష్యత్ తరాలను గ్రంథాలయం దిశగా నడిపించే విధంగా సిబ్బంది కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పర్యవేక్షణాధికారి బి.రాజగోపాల్, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఎస్.ఆర్. రంగనాథన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

ఘనంగా గ్రంథపాలకుల దినోత్సవం

మద్దిలపాలెం: డాక్టర్ వి.ఎస్.కృష్ణా డిగ్రీ కళాశాలలో గ్రంథ పాలకుల దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ శాస్త్ర పితామహుడు డాక్టర్ ఎస్.ఆర్.రంగనాథన్ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపాల్ ఐ.విజయబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రంథాలయాల అభివృద్ధికి, నిర్వహణకు డాక్టర్ ఎస్.ఆర్. రంగనాథన్ చేసిన సేవలను స్మరించుకున్నారు. విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుని, విజ్ఞానాన్ని సముపార్జించాలని ఆకాంక్షించారు.

పావురాల కొండపై సదుపాయాలు కల్పించాలి



పావురాల కొండపై బుద్ధిస్ట్ సొసైటీ సభ్యులు

భీమునిపట్నం: భీమిలిలో బౌద్ధ భిక్షువులు నివాసమున్న పావురాల కొండను ప్రభుత్వం సంరక్షించి, తగిన సదుపాయాలు కల్పించాలని బుద్ధిస్ట్ మాన్యుమెంట్ ప్రొటెక్షన్ కమిటీ కన్వీనర్ కొత్తపల్లి వెంకరమణ కోరారు. ఆయనతోపాటు, ది బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా సభ్యులు పావురాల కొండను శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ కొండపై బౌద్ధ భిక్షువులు రెండో శతాబ్దంలో నివాసముండగా వాటి గుర్తులు ఇంకా ఉన్నాయన్నారు. ఎంతో ప్రాముఖ్యత కలిగిన ఈ కొండపైకి సందర్శకులు వెళ్లడానికి కనీసం రోడ్డు సదుపాయం లేదన్నారు. ఇతర సదుపాయాలు కూడా లేవని, ఇటువంటి గొప్ప ప్రాంతాన్ని అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, ఆ మేరకు చర్యలు తీసుకోవాలని కోరారు. బుద్ధిస్ట్ సొసైటీ జిల్లా కమిటీ సభ్యులు ఎం.మల్లయ్యరాజు, కర్రి సత్యనారాయణ, సిద్ధార్థ గౌతంబాబు, రమణ, సింహాద్రి, తిరుమలరావు పాల్గొన్నారు.

మణిపూర్‌లో శాంతి కోరుతూ ర్యాలీ



మధురవాడలో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

మధురవాడ: మణిపూర్‌లో క్రైస్తవులపై జరుగుతున్న దాడులను ఆపాలని, శాంతి పునరుద్ధరణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే చర్యలు చేపట్టాలని పలువురు క్రైస్తవ మత పెద్దలు, పాస్టర్లు డిమాండ్ చేశారు. మణిపూర్‌లో దాడులకు నిరసనగా ఆంధ్రప్రదేశ్ క్రిస్టియన్ జాయింట్ ఏక్షన్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం శాంతి ర్యాలీ నిర్వహించారు. కొమ్మాది కూడలి నుంచి మధురవాడ జోనల్ ఆఫీసు, ఆప్ బ్రిడ్జి, ఆయుష్ ఆర్‌జేడీ ఆఫీసు, చంద్రంపాలెం మీదుగా కార్‌షెడ్ వరకు ప్ల కార్డులు, బ్యానర్లు ప్రదర్శించి నినాదాలు చేశారు. శిల్పారామం జాతర వద్ద మానవహారం ఏర్పాటు చేసి నిరసన తెలిపారు. మణిపూర్‌లో రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి చర్యలు చేపట్టకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. బిషప్ లోపింటి శామ్యూల్, బిషప్ జార్జిబాబు, డానియల్ శ్యామ్, భాస్కరరాజు, డేవిడ్ రాజు, ప్రసన్న కుమార్, ప్రకాష్, బిషప్ జాన్‌మేరీ, శామ్యూల్ సాంబ, ప్రేమ తరంగ్, లోకేష్ పెదగాడ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

చిట్టివలసలో విషాదం

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు చిట్టివలసలో శనివారం విషాదం అలముకుంది. ఇంటికి ఆధారమైన ఇద్దరు యువకులు ఒకే రోజు మృత్యువాత పడడంతో వారి కుటుంబాలతోపాటు చిట్టివలస గ్రామం దుఃఖసాగరంలో మునిగిపోయింది. జమ్మూ రాష్ట్రంలో ఆర్మీలో సేవలు అందిస్తున్న కొల్లి పూర్ణ రామచంద్రారెడ్డి (33) విద్యుదాఘాతంతో మృతి చెందగా అతని మృతదేహం శనివారం రాత్రి 10.30 తర్వాత జమ్మూ నుంచి విశాఖ చేరుకోనుంది. ఇదిలా ఉండగా ఇదే గ్రామంలో పెరికివీధిలో నివసిస్తున్న పెయింటర్ డింగి పైడిరాజు (33) అనుమానాస్పద స్థితిలో భీమిలిలో మృతి చెందాడు. పోస్టుమార్టం అనంతరం అతని అంత్యక్రియలు శనివారం సాయంత్రం చిట్టివలసలో పూర్తయ్యాయి. ఇద్దరు యువకులు మృత్యువాత పడడాన్ని చిట్టివలస గ్రామస్తులు జీర్ణించుకోలేకపోతున్నారు.

'కులాల వారీగా జనగణన అవసరం'

సీతంపేట: దేశంలో కుల గణన జరగకపోవడం వల్ల బీసీ సామాజిక వర్గం చాలా నష్టపోతోందని, దేశంలో 54 శాతం ఉన్న బీసీలకు 27 శాతం మాత్రమే రిజర్వేషన్ కల్పిస్తున్నారని పలువురు వక్తలు పేర్కొన్నారు. 15 శాతం ఉన్న ఓసీలకు మాత్రం 10 శాతం ఈడబ్ల్యూస్ రిజర్వేషన్ కల్పించడం ప్రభుత్వాలకు బీసీలపై ఉన్న చిన్న చూపునకు నిదర్శనమని అభిప్రాయం వ్యక్తం చేశారు. బీసీ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వీరవిల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శనివారం 'జన గణనలో సమగ్ర కులగణన' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సభాధ్యక్షుడు కట్టా మల్లేశ్వరరావు మాట్లాడుతూ దేశంలో కులాల మధ్య ఏర్పడిన అసమానతలు రూపుమాపాలంటే సమగ్ర కులగణన తప్పనిసరి పేర్కొన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, చింతపల్లి రాంబాబు, పెబ్బిలి రవికుమార్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పబ్లిక్ డిమాండ్

మురుగునీటి నిల్వతో సమస్యలు



కృష్ణా కాలనీలో అసంపూర్తిగా నిలిచిన డ్రైనేజీ నిర్మాణం

తగరపువలస: జీవీఎంసీ మూడో వార్డు కృష్ణా కాలనీలో ఇటీవల డ్రైనేజీల నిర్మాణం చేపట్టి అసంపూర్తిగా వదిలేశారు. అసంపూర్తిగా గోతులు తీసి వదిలేయడంతో మురుగు నీరు నిలిచి విపరీతమైన దుర్వాసనకుతోడు దోమలు, ఈగలు ముసురుతున్నాయి. వీటి బెడద నుంచి తప్పించేలా డ్రైనేజీ నిర్మాణం పూర్తి చేయాలి. మురుగునీటి సమస్యను జీవీఎంసీ భీమిలి జోన్ ఇంజినీరింగ్, శానిటేషన్ సిబ్బంది పరిష్కరించాలి.

– షహమిదా బేగం, కృష్ణాకాలనీ, భీమిలి

త్వరలో పంచగ్రామాల సమస్యకు పరిష్కారం

- పవన్.. దిగజారుడు వ్యాఖ్యలు మానుకో
- వలంటీర్ల వల్లే ప్రజలకు విశేష సేవలు
- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



అభివృద్ధి పనులకు సంబంధించి శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ముత్తంశెట్టి శ్రీనివాసరావు

సింహాచలం: అవినీతికి తావులేకుండా.. పార్టీలతో సంబంధం లేకుండా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. అడవివరంలోని మధ్యవీధి, పోస్టాఫీసువీధి, పాత అడవివరం, కాపు వీధి ప్రాంతాల్లో రూ. 75.25 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్లు, సీసీ కాల్వల పనులకు సంబంధించి శనివారం ముత్తంశెట్టి శంకుస్థాపన చేశారు. పోస్టాఫీసు వీధిలో ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించి అనంతరం అక్కడ జరిగిన సభలో మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్ సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ప్రవేశపెట్టి ప్రజలకు మేలు చేశారన్నారు. ఆ వ్యవస్థలు ఉండడం వల్లే కరోనా కష్ట కాలంలో కూడా ప్రజల బాగోగులు చూసే అవకాశం కలిగిందన్నారు. కార్యాలయాలు, అధికారులు చుట్టూ తిరిగే పని లేకుండా చేశారన్నారు. అలాంటి వలంటీర్ వ్యవస్థను జనసేన అధినేత పవన్ కల్యాణ్ విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. వలంటీర్ల వల్లే ఆడపిల్లలు మాయమవుతున్నారని అనడం ఆయన అవగాహన రాహిత్యానికి నిదర్శనమన్నారు. మీ ఇంట్లో ఆడ పిల్లలెవరైనా మిస్ అయ్యారా అని పవన్‌ను ప్రశ్నించారు.

బాధితులకు న్యాయం

అడవివరం బీఆర్‌టీఎస్ రోడ్డు విస్తరణ విషయమై మళ్లీ అధికారులతో సమావేశం పెడతామన్నారు. బాధితులకు న్యాయం జరిగేలా చేస్తానని హామీ ఇచ్చారు. సింహాచలం దేవస్థానంతో ముడిపడి ఉన్న పంచగ్రామాల భూసమస్య త్వరలోనే పరిష్కారం అవుతుందన్నారు. అలాగే ఇళ్ల మరమ్మతులకు కూడా అవకాశం ఇచ్చేలా చర్యలు చేపడతామన్నారు.

ఒక వార్డులోనే రూ.110 కోట్ల లబ్ధి

ఒక్క 98వ వార్డులో మొత్తం 39వేల 500 మంది లబ్ధిదారులకు రూ.110 కోట్లు సంక్షేమ పథకాల ద్వారా నగదు అందించడం జరిగిందన్నారు. అనంతరం పోస్టాఫీసు వీధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ముత్తంశెట్టి నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లలో వారికి అందిన లబ్ధిని వివరించారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి రావాలని వారికి తెలియజేశారు. కార్యక్రమంలో 98వ వార్డు కార్పొరేటర్ పి.వి.నరసింహం, జీవీఎంసీ 8వజోన్ కమిషనర్ మల్లయ్యానాయుడు, వైఎస్సార్‌సీపీ భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్, పార్టీ 98వవార్డు అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు, ఇన్‌చార్జి ఎర్ర వరహా నరసింహం, పార్టీ నాయకులు నడింపల్లి రామరాజు, పీతల అప్పలరాజు, లంక సత్తిబాబు, మజ్జి ధర్మా, మజ్జి ధర్మా, ఎస్.కృష్ణ, దొంతల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

'సకల కళాకారుల' నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

సీతంపేట: విశాఖ సకల కళాకారుల సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం శనివారం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో జరిగింది. సంఘం గౌరవాధ్యక్షుడిగా సినీ నిర్మాత కంచర్ల అచ్యుతరావు, అధ్యక్షురాలిగా సినీ కవి జాలాది కుమార్తె జాలాది విజయ, ప్రధాన కార్యదర్శిగా చెన్నా తిరుమలరావు, కార్యదర్శిగా కె.లోకేశ్వరరావు, కోశాధికారిగా మధుపాడ రమణి, ఉప అధ్యక్షుడిగా జె.ఎం.ఆర్ నెహ్రూ, ఉపాధ్యక్షులుగా ఎం.త్రినాథరావు, దండు నాగేశ్వరరావు, అరుణ్‌సాయి కుమార్, సహాయ కార్యదర్శులుగా మిమిక్రీ శ్రీనివాస్, కందర్ప రాధ, జి.జగదీష్, నిర్వాహక కార్యదర్శిగా కోరుకొండ రంగారావులతోపాటు మరో 13 మంది సలహాదారులు, ఈసీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ వారి చేత ప్రమాణ స్వీకారం చేయించారు. గౌరవాధ్యక్షుడు కంచర్ల అచ్యుతరావు మాట్లాడుతూ కళాకారుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తానని తెలిపారు. అధ్యక్షురాలు జాలాది విజయ మాట్లాడుతూ నగరంలోని కళాకారులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన నృత్యాలు, ఏకపాత్రాభినయం, సినీ గీతాలు, మిమిక్రీ, డోనాల్డ్ డక్ ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో నరవ ప్రకాశరావు, బొట్టా వేణు, దండు నాగేశ్వరరావు, కొరిటాల ప్రభాకర్, ఎం.వి.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అప్రకటిత విద్యుత్ కోతలతో అవస్థలు

తగరపువలస: చిట్టివలస విద్యుత్ సబ్ స్టేషన్ పరిధి అర్బన్, రూరల్‌లో అప్రకటిత విద్యుత్ కోతలతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఉక్కపోతకు తోడు విద్యుత్ కోతలు విధిస్తుండటంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. శనివారం సాయంత్రం భీమిలి మండల పరిధిలో చాలా చోట్ల విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పలువురు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

ఆలయాల్లో భగవద్గీత ప్రచారం

తగరపువలస: శుభకార్యాలు, ఆలయాల్లో ఉచితంగా భగవద్గీత ప్రచారం, ప్రవచనాలు చేపట్టనున్నట్టు టీటీడీ ధర్మాచార్యులు, ఆధ్యాత్మిక ధర్మ ప్రచారకులు కోట రామకృష్ణనాయుడు తెలిపారు. భక్తిగీతాలను కూడా ఆలపించనున్నామని తెలిపారు. 73820 72194, 95814 76139లో సంప్రదించాలని కోరారు.